సాక్షి అన్నమయ్య జిల్లా

మంగళవారం । 30 । జూలై । 2024



కడప బ్యాట్స్‌మన్ జోరు
కడపలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్-19 అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ మ్యాచ్‌లో కడప బ్యాట్స్‌మన్ రాణించడంతో కడప జట్టు ఆధిక్యంలో కొనసాగుతోంది. - 8లో



ఉసురు తీసిన ఉత్సాహం
ముగ్గురు స్నేహితులు సరదాగా విహారయాత్రకు వెళ్లి మృత్యువాతపడ్డారు. మూడు కుటుంబాల్లో విషాదం నింపిన ఈ దుర్ఘటన ఆదివారం జరిగింది. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.360	రూ.400
రెండోరకం	రూ.240	రూ.356



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 850 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	450	450
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 96.820 కిలోలు

న్యూస్‌రీల్

ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత



ఫిర్యాదుదారుడితో మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటి : ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన ఫిర్యాదుల పరిష్కారానికి జిల్లా పోలీసులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా 40 మంది నేరుగా ఎస్పీని కలిసి సమస్యలను విన్నవించుకున్నారు. ఫిర్యాదులపై ఆయా ప్రాంతాల పోలీసు అధికారులకు వీడియో టెలీకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి వీటిని విచారించి త్వరితగతిన పరిష్కరించాలన్నారు.పోలీసుల చర్యల పట్ల ప్రజలకు నమ్మకాన్ని కలిగించాలని ఎస్పీ జిల్లా పోలీస్ యంత్రాంగానికి సూచించారు.

శాంతిభద్రతలపై కర్నూలు డీఐజీ సమీక్ష

రాయచోటి : అన్నమయ్య జిల్లా పరిధిలో శాంతిభద్రతల పట్ల కర్నూల్ రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ సమీక్షించారు. సోమవారం రాయచోటి పోలీసు ప్రధాన కార్యాలయాన్ని జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా పరిధిలో శాంతిభద్రతల సమస్యలతో పాటు మదనపల్లె పట్టణంలో రెవెన్యూ డివిజనల్ కార్యాలయం దగ్ధమైన కేసు దర్యాప్తు స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు జిల్లా పోలీసు కార్యాలయానికి చేరుకున్న కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్‌కు జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పూల మొక్కను అందించి స్వాగతం పలికారు. క్రమంలో ముందుగా జిల్లా ఆర్మ్‌డ్ పోలీస్ సిబ్బంది డీఐజీకి గౌరవ వందనం సమర్పించారు

భూ బాధితులకు అండగా ఉంటాం




మాట్లాడుతున్న నారాయణ

మదనపల్లె : భూ బాధితులకు అండగా ఉంటామని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. సోమవారం మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద విలేకరులతో ఆయన మాట్లాడుతూ 22-ఎ రికార్డులలో జరిగిన అవకతవకల వల్లే రెవెన్యూ అధికారులు,భూకబ్జాదారులు కలిసి ప్రభుత్వ రికార్డులు తగలబెట్టారన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా కాంట్రాక్టర్లు మారలేదని , ఏప్రభుత్వం వచ్చినా కాంట్రాక్టర్లకు మద్దతు పలుకుతున్నారని, దీంతో పేద ప్రజలకు అన్యాయం జరుగుతోందన్నారు. ఆగస్టు 4న బాధితులతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఈశ్వరయ్య, శివారెడ్డి, రామానాయుడు, సాంబ, క్రిష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

వైభవం..పల్లకీ ఉత్సవం

రాయచోటి టౌన్ : రాయచోటిలోని వీరభద్ర



పల్లకీలో ఊరేగుతున్న శ్రీ భద్రకాళీ సమేతుడు

స్వామి ఆలయంలో పల్లకీ ఉత్సవం సోమవారం వైభవంగా జరిగింది.సోమవారం రాత్రి స్వామి, భద్రకాళీ అమ్మవార్ల మూల విరాట్‌లకు అభిషేకాలు, పూజలు జరిపారు.అనంతరం ఉత్సవ మూర్తులను పూలు, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణలతో అందంగా అలంకరించి పల్లకీలో కొలువుదీర్చారు. అనంతరం మాఢవీధుల్లో ఊరేగించారు. ఈవో డీవీ రమణారెడ్డి, ప్రధాన అర్చకులు కృష్ణయ్య స్వామి, శంకరయ్య స్వామి, శేఖర్ స్వామి, మల్లికార్జున స్వామి, రాచరాయ యోగీ స్వామి, భక్తులు పాల్గొన్నారు.

తగ్గుముఖం పడుతున్న టమాటా: కిలో రూ.40

మదనపల్లె సిటీ : టమటా దిగుబడులు పెరగడంతో ధరలు క్రమేపి తగ్గుముఖం పడుతున్నాయి. వారం రోజుల నుంచి ధరల్లో మార్పులు కన్పిస్తున్నాయి. సోమవారం మదనపల్లె మార్కెట్‌లో మొదటి రకం కిలో రూ.40 ,రెండో రకం రూ. 35 పలికింది. 850 మెట్రిక్ టన్నులు కాయలు వచ్చాయి 28వతేదీన 1087 మెట్రిక్ టన్నులు, 27వతేదీన 1106 మెట్రిక్ టన్నుల కాయలు వచ్చాయి.కర్ణాటక, అనంతపురం,చిత్తూరుల్లో టమటా దిగుబడులు పెరగుతున్నాయి. దీంతో ధరలు మరింత తగ్గుముఖం పడుతాయని వ్యాపారవర్గాల వారు తెలిపారు.

నీలి నీడలు!

- వైఎస్ జగన్ హయాంలో రాయచోటిలో అభివృద్ధి పరవళ్లు
- ప్రభుత్వం మారడంతో ఎక్కడికక్కడ ఆగిపోయిన పనులు
- కూటమి సర్కార్ నిధులు అందిస్తే తప్ప పనులకు వీడని గ్రహణం



శిల్పారామంలో వివిధ అభివృద్ధి పనుల కోసం కేటాయించిన స్థలం

సాక్షి రాయచోటి : అన్నమయ్య జిల్లాలో మొన్నటి వరకు అభివృద్ధి పరవళ్లు తొక్కింది. నిధులు కూడా గలగల రాలాయి. ప్రధానంగా జిల్లా కేంద్రమైన రాయచోటిలో మౌలిక సదుపాయాల కల్పనకు వైఎస్ జగన్ సర్కార్ పెద్ద ఎత్తున నిధులు కేటాయించింది. జిల్లాల పునర్విభజనలో భాగంగా ఏర్పడిన కొత్త జిల్లాల్లో అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి బాగా అభివృద్ధి చెందిందనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది.ప్రభుత్వం మారడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. కూటమి సర్కార్ వాటిని కొనసాగిస్తుందా లేదా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి.

కొత్త ప్రభుత్వ నిర్ణయాలపై చర్చ

అన్నమయ్య జిల్లాలో పూర్తయిన పనులు మినహాయిస్తే కొన్ని ఆగిపోతున్నాయి. ఎందుకంటే గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులకు సంబంధించి ఇప్పుడు ప్రభుత్వం మారడంతో ఏవైనా ఇబ్బందులు ఎదురవుతాయోనన్న ఆందోళన కాంట్రాక్టర్లను వెంటాడుతోంది. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌కు సంబంధించి గతంలో సుమారు 60 ఎకరాలకు పైగా స్థలాన్ని కేటాయించడంతోపాటు మొదటి విడతగా రూ.100 కోట్ల నిధులు కూడా మంజూరయ్యాయి. అయితే ఇప్పుడు అక్కడే నిర్మాణాలకు ముందుకు వెళతారా? లేక మరొక ప్రాంతంలో స్థల పరిశీలన చేస్తారా? అన్న చర్చ జరుగుతోంది. అలాగే ఉర్దూ పీజీ కళాశాలలు మొదలుకొని కేంద్రీయ విద్యాలయం, జిల్లా పోలీసుశాఖ కార్యాలయం, పోలీసు ట్రైనింగ్ సెంటర్, ఆటో నగర్, పోలీసు మైదానం ఇలా అనేక శాఖలకు సంబంధించిన పనులపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో అన్నది అర్థం కావడం లేదు. రాష్ట్రంలో కొత్త సర్కార్ ఏర్పడిన నేపథ్యంలో మరొకమారు జిల్లా అధికారులతో పాటు ఇక్కడి ప్రజాప్రతినిధులు పరిశీలించిన తర్వాతనే స్థలాలు, భవనాల ఎంపిక ఉంటాయని కింది స్థాయి వర్గాలు పేర్కొంటున్నాయి.

నిలిచిపోతున్న పనులు

రాయచోటిలో చేపడుతున్న పనులు మధ్యలో ఆగిపోతున్నాయి. సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. గత ప్రభుత్వ హయాంలోనే చేపట్టిన పలు పనులు ప్రస్తుతం జరగడంలేదు. ప్రధానంగా రాయచోటి-కడప ప్రధాన రహదారిలోని బండ్లపల్లె సమీపంలో ఏర్పాటవుతున్న శిల్పారామానికి సంబంధించి స్థల సేకరణ పూర్తయి ప్రహారీల నిర్మాణం కొనసాగుతుండగా, మధ్యలో పనులు ఆగిపోయాయి. శిల్పారామం లోపల చిన్నచిన్న భవనాలు పూర్తయినా ప్రస్తుతం కొద్దిరోజులుగా పనులు జరగడం లేదు. అలాగే రాయచోటిలోని క్రికెట్ స్టేడియం చుట్టూ కాంపౌండ్ నిర్మించాల్సి ఉంది. గాలివీడుకు వెళ్లే దారిలో ఉన్న నగరవనం పనులు కూడా వేగం పుంజుకోవాల్సి ఉంది. రాయచోటి పరిధిలో ఇంకా సర్కిళ్ల పనులు కూడా అంతంత మాత్రంగానే సాగుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జరుగుతున్న అభివృద్ధి పనులపై నీలినీడలు అలుముకున్నాయి. జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పనులకు పచ్చజెండా ఊపితే తప్ప వేగంగా ముందుకు కదిలే పరిస్థితులు లేవని పట్టణ వాసులు పేర్కొంటున్నారు.



నిలిచిపోయిన ప్రధాన ద్వారం పనులు

ఐఏబీ సమావేశానికి డుమ్మా

ముఖ్యమైన సమావేశానికి హాజరుకాని ముగ్గురు ఎమ్మెల్యేలు



పుట్టా సుధాకర్ యాదవ్



పుత్తా చైతన్య రెడ్డి



ఆర్.మాధవిరెడ్డి

సాక్షి ప్రతినిధి, కడప : రాయలసీమకు ప్రాణప్రదమైన శ్రీశైలం ప్రాజెక్టుకు వరద ఉధృతంగా ఉంది. 4.40 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో లభిస్తోంది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా సీమ సాగునీటి ప్రాజెక్టులకు నీరు నింపుకునే అవకాశం ఉంది. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వారెవ్వరైనా వరద జలాలు పట్ల తక్షణం స్పందించాల్సి ఉంది. సోమవారం నంద్యాలలో ఇరిగేషన్ అడ్వయిజరీ బోర్డు (ఐఏబీ) సమావేశం ఏర్పాటు చేశారు. అత్యంత ముఖ్యమైన ఈ సమావేశానికి హాజరు కావాల్సిన ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టారు. ప్రజల పట్ల, ప్రాంతం పట్ల ఆయా ప్రజాప్రతినిధులకు ఉన్న చిత్తశుద్ధి లోపం బహిర్గతమైంది.

రాయసీమ సాగునీటి ప్రాజెక్టుల ఐఏబీ సమావేశం మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, ఎస్ఎండీ ఫరూక్ నేతృత్వంలో సోమవారం నంద్యాలలో నిర్వహించారు. శ్రీశైల జలాశయ వెనుక జలాలను సమర్థవంతంగా వినియోగించుకుని తెలుగుగంగ, ఎసఆర్‌బీసీ, కేసీ కెనాల్, హెచ్ఎన్ఎస్ఎస్, జీఎన్ఎస్ఎస్ అంతర్భాగంగా ఉన్న ప్రాజెక్టుల్లో నీరు నిల్వ చేసుకోవడం ఈ సమావేశం ప్రధాన ఉద్దేశం. పైగా నిర్దేశించిన సామర్థ్యంతో కాలువల్లో నీరు ప్రవహించేందుకు తక్షణ మరమ్మతులకు అత్యవసరమైన నిధుల కేటాయింపు ప్రతిపాదనలు కోరారు. కేసీ కెనాల్ పరిధిలో 1,75,388 ఎకరాల ఆయకట్టుకు నీరు ఇవ్వాల్సి ఉంది. అందులో 92వేల ఎకరాలు వైఎస్సార్ జిల్లాలో ఆయకట్టు ఉంది. ప్రధానంగా మైదుకూరు, కమలాపురం, కడప ప్రాంతాల్లో అత్యధికంగా ఆయకట్టు ఉంది. ఇంకో వైపు గండికోట, మైలవరం, వామికొండ, సర్వారాయసాగర్, బ్రహ్మంసాగర్, పైడిపాళెం ప్రాజెక్టుల్లో సుమారు 60 టీఎంసీలు నిల్వ చేసుకునే అవకాశం ఉంది. వాస్తవంగా నంద్యాల ఐఏబీ మీటింగ్ జిల్లాకు ప్రాణపదమేనని చెప్పాలి. అలాంటి సమావేశానికి మైదుకూరు, కమలాపురం, కడప ఎమ్మెల్యేలు పుట్టా సుధాకర్‌యాదవ్, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, మాధవీరెడ్డి హాజరు కాకపోవడం చర్చనీయాంశమైంది. ప్రొద్దుటూరు, జమ్మలమడుగు ఎమ్మెల్యేలు జిల్లా నుంచి హాజరయ్యారు. వరద జలాలు ఉన్నప్పుడే నీరు డ్రా చేసుకోవాల్సి ఉండగా ఆ ప్రాధాన్యతను ఎమ్మెల్యేలు గుర్తించలేదు. ప్రధానంగా మైదుకూరు పరిధిలో 54వేల ఎకరాల ఆయకట్టు ఉంది.ఎమ్మెల్యే పుట్టా బాధ్యత మర్చిపోయారని పలువురు వాపోతున్నారు. ప్రజల శ్రేయస్సు కోసం ఎమ్మెల్యేలు కృషి చేయాల్సిన అవసరం ఉంది.

ఏఎఫ్ఏయూ సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఏఎఫ్‌యూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో సెమిస్టర్ పరీక్షా ఫలితాలను విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ఆచార్య జి.విశ్వనాథకుమార్, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య రాజేష్ కుమార్ రెడ్డితో కలిసి విడుదల చేశారు. సోమవారం విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ ప్లానింగ్‌కు సంబంధించిన 2వ సెమిస్టర్, ఆర్కిటెక్చర్‌కు సంబంధించిన 4వ, 6వ, 8వ సెమిస్టర్ ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ పరీక్ష ఫలితాలను కళాశాల వెబ్‌సైట్ లో పొందుపరిచామన్నారు. అదనపు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఫణీంద్రారెడ్డి, ఉదయప్రకాష్ రెడ్డి, లక్ష్మీ ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.



ఫలితాలను విడుదల చేస్తున్న ఏఎఫ్‌యూ వీసీ ఆచార్య జి. విశ్వనాథ్‌కుమార్, అధికారులు

వైఎస్సార్ సీపీ నాయకులే లక్ష్యంగా విచారణ



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దేశాయ్‌తిప్పారెడ్డి

మదనపల్లె : మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో గత ఆదివారం జరిగిన అగ్నిప్రమాద ఘటనలో రికార్డులు కాలిపోవడం బాధాకరమని, ప్రతి ఒక్కరూ దీనిని తప్పక ఖండించాల్సిందేనని మాజీ ఎమ్మెల్యే డాక్టర్.దేశాయ్ తిప్పారెడ్డి అన్నారు. సోమవారం మదనపల్లె వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి మీడియా సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ...సబ్ కలెక్టరేట్ రికార్డుల దగ్ధం ఘటన ప్రమాదవశాత్తు జరిగిందా, లేక ఉద్దేశపూర్వకంగా జరిగిందా, కుట్రకోణం దాగి ఉందా అని తేల్చాల్సింది రాష్ట్ర ప్రభుత్వమే అనిఅన్నారు. కేసు దర్యాప్తు జరుగుతున్న సమయంలో కొంతమందిని అనుమానితులుగా పేర్కొంటూ కొన్ని పత్రికల్లో కథనాలు రాయడం, దాని ఆధారంగా చేసుకుని తక్షణమే వైఎస్సార్ సీపీ నాయకులను లక్ష్యంగా చేసుకుని, ఏదో జరిగిపోయిందనేలా ప్రజల్లో అనుమానాలు, అపోహలు సృష్టించడం చేస్తున్నారన్నారు. ఘటన జరిగి వారంరోజులు కావస్తున్నా... సబ్ కలెక్టరేట్‌లో ఏ రికార్డులు కాలిపోయాయనేది ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన రాలేదన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి ఇదే విషయమై...ఘటనలో ప్రమేయం ఉన్న బాధ్యులను తక్షణమే ప్రకటించాలని డిమాండ్ చేశారన్నారు. దోషులను శిక్షించాలని కోరారన్నారు. అయితే ఘటనతో సంబంధం లేని వ్యక్తులను పత్రికల్లో ప్రస్తావించడం, కొందరు ప్రెస్‌మీట్లు పెట్టి ఇష్టారాజ్యంగా మాట్లాడటం మంచి పద్ధతి కాదన్నారు. లేనిపోని అపోహలు సృష్టించకుండా, నిజాలు నిగ్గుతేల్చి, బాధ్యులను ప్రకటించి, దోషులను శిక్షించాలన్నారు.కౌన్సిలర్లు ప్రసాద్‌బాబు, రేణుక, వైఎస్సార్ సీపీ నాయకులు కేశవరెడ్డి, జన్నేరాజేంద్ర నాయుడు, గుండ్లూరురఫీ, మస్తాన్‌రెడ్డి, సురేంద్ర, బండపల్లి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టరేట్ ఫైల్స్ దగ్ధం ఘటనపై సమగ్ర దర్యాప్తు

- కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్
- 12 బృందాలతో 52 మంది అనుమానితులపై విచారణ
- మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషాపై కేసు నమోదు



మదనపల్లె : అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో ఫైల్స్ దగ్ధంకు సంబంధించి సమగ్ర దర్యాప్తు జరుపుతున్నట్లు కర్నూలు రేంజ్ డీఐజీ కోయప్రవీణ్ తెలిపారు. సోమవారం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, అడిషనల్ ఎస్పీ రాజ్ కమల్‌తో కలిసి డీఐజీ కోయప్రవీణ్ మాట్లాడుతూ...ఫైల్స్ దగ్ధం ఘటనకు సంబంధించి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో 135/2024 కింద కేసు నమోదు చేసి విచారణ సాగిస్తున్నామన్నారు. అందులో భాగంగా ఈనెల 21వ తేదీ రాత్రి 11.30 గంటలకు సంఘటన జరిగినప్పటి నుంచీ ఇప్పటివరకు కేసు విచారణ క్రమపద్ధతిలో జరిగిందన్నారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్, ఆర్ఎఫ్ఎస్ఎల్ టీం , ఎలక్ట్రిసిటీ, ఫైర్, నాగపూర్ ఫైర్ రిస్క్యూ మేనేజ్‌మెంట్ సహాయంతో పటిష్ట దర్యాప్తు చేశామన్నారు. కేసులో ఇప్పటి వరకు 52మందిని విచారించి, వారిలో కొందరిని అనుమానితులుగా గుర్తించామన్నారు. కేసు విచారణ దశలో ఉన్నందున పేర్లను వెల్లడించలేమన్నారు. కేసు విచారణలో భాగంగా ఇప్పటివరకు సెల్‌టవర్ డంప్ నుంచి 20వేలకు పైగా సీడీఆర్ సేకరించామన్నారు. అనుమానితుల వాట్సప్, ఐపీడీఎస్ అనాలసిస్ చేశామన్నారు. 750కి పైగా సగం కాలిన ఫైల్స్ విచారణలో సేకరించామన్నారు. ఘటనలో వైర్లు, బూడిద, ఆయిల్ శ్యాంపుల్స్ సేకరించి ఎఫ్ఎస్ఎల్‌కు రిపోర్ట్ కోసమై పంపామన్నారు. స్థానిక ప్రజలు, మీడియా అందించిన సమాచారం మేరకు అనుమానితుల ఇళ్లలో సోదాలు చేసి కొన్ని విలువైన డాక్యుమెంట్స్ స్వాధీనం చేసుకున్నామన్నారు. వాటిని క్రోడీకరించి విచారించిన తర్వాత ఉండకూడని దస్త్రాలు కలిగి ఉన్నారన్న నేరంపై 8 కేసులు నమోదుచేశామన్నారు. ఫోరెన్సిక్ ఫలితాలు 10-15 రోజుల్లో వచ్చే అవకాశం ఉందని, ఫలితాల తర్వాత అనుమానితులపై నిర్ధారణకు వస్తామన్నారు. కేసు విచారణలో భాగంగా మాధవరెడ్డి, తుకారాం, శశికాంత్, మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా, ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డితో పాటు మరికొందరి అనుమానితుల ఇళ్లలో సోదాలు చేసి డాక్యుమెంట్స్ స్వాధీనం చేసుకున్నామన్నారు. అందులో మాధవరెడ్డి ఇంట్లో 500 విలువైన డాక్యుమెంట్స్ దొరికాయన్నారు. శశికాంత్ ఇంట్లో మదనపల్లె భూములకు సంబంధించి పత్రాలు లభించాయన్నారు. మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఇంట్లో ప్రభుత్వ భూములకు సంబంధించి ఉండకూడని దస్త్రాలు కలిగిఉండటంపై కేసు నమోదుచేశామన్నారు. ఇదేవిధంగా ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డిపై కేసు నమోదుచేసే అవకాశాలు ఉన్నాయన్నారు. రైతుల నుంచి బెదిరించి లాక్కున్న ప్రభుత్వభూములపై ఫిర్యాదులు వస్తే రెవెన్యూ అధికారుల సూచన మేరకు కేసులు నమోదుచేస్తామన్నారు.

నాపైవన్నీ ఆరోపణలే : బాబ్‌జాన్



మదనపల్లె : పత్రికల్లో తనపై చేస్తున్న ఆరోపణలకు ఆధారాలు చూపి నిరూపించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బాబ్‌జాన్ డిమాండ్ చేశారు. మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయ ప్రమాదానికి సంబంధించి జరుగుతున్న విచారణ సందర్భంగా తాను పరారైనట్లు ఆరోపణలు చేసి తన వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగించారని చెప్పారు. ఆయన సోమవారం మదనపల్లెలో మాట్లాడుతూ తాను ఇంట్లోలేని సమయంలో వచ్చినవారు పోలీసులని తెలియక కుటుంబసభ్యులు తలుపు తీయలేదని చెప్పారు. ఈ విషయం తెలిశాక స్వయంగా పోలీసుల వద్దకు వెళ్లి విచారణకు హాజరయ్యానని, పిలిస్తే మళ్లీ హాజరవుతానని చెప్పానన్నారు. తాను ఏ తప్పు చేశానో ఆధారాలతో నిరూపించాలని కోరారు. విద్యాసంస్థ ద్వారా తాను ఎందరికో విద్యనందించానని చెప్పారు. తనపై చేస్తున్న ఆరోపణలను నిరూపించకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయించి పరువునష్టం దావా వేస్తానన్నారు. పెద్దిరెడ్డి కుటుంబానికి సన్నిహితుడిని కావడంవల్లే టార్గెట్ చేసి ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు.

ముగ్గురు రెవెన్యూ అధికారుల సస్పెన్షన్



ఆర్డీఓ మురళి



హరిప్రసాద్



గౌతమ్

మదనపల్లె : అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో జరిగిన అగ్నిప్రమాదానికి సంబంధించి రెవెన్యూ అధికారులపై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. మదనపల్లెలో గతంలో ఆర్డీవోగా పనిచేసిన మురళి, ప్రస్తుత ఆర్డీవో హరిప్రసాద్, సబ్ కలెక్టరేట్ సీనియర్ అసిస్టెంట్ గౌతమ్‌లను సస్పెండ్ చేస్తూ రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా ఉత్తర్వులు జారీచేశారు. ఈనెల 21వ తేదీ రాత్రి 11.30 గంటల సమయంలో మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో అగ్నిప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై ప్రత్యేకదృష్టి సారించిన ముఖ్యమంత్రి చంద్రబాబు డీజీపీ ద్వారకాతిరుమలరావు, సీఐడీ చీఫ్ రవిశంకర్‌లను ప్రత్యేక హెలికాప్టర్‌లో మదనపల్లెకు పంపి విచారించాలని ఆదేశించారు. వారు అగ్నిప్రమాదం యాక్సిడెంట్ కాదని, ఫైర్ ఇన్సిడెంట్ అని పేర్కొన్నారు. ఇద్దరు ఆర్డీవోలతో పాటు సబ్ కలెక్టరేట్ సిబ్బంది 35 మందిని అదుపులోకి తీసుకుని సుమారు ఐదురోజుల పాటు పూర్తిస్థాయిలో విచారించారు. కొంతమంది వైఎస్సార్‌సీపీ నాయకుల ఇళ్లల్లో పోలీసులు సోదాలు చేసి విచారించారు. ఈ నేపథ్యంలో సబ్ కలెక్టరేట్ అగ్నిప్రమాద ఘటనకు కారకులుగా పేర్కొంటూ ఇద్దరు ఆర్డీవోలను, సీనియర్ అసిస్టెంట్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది.

అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం

జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్



ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో స్వీకరించిన అర్జీలను నాణ్యతే ప్రాణాణికంగా త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశహాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. జిల్లా కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్‌ఓ సత్యనారాయణ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

గ్రామ పంచాయతీ సమస్యల పరిష్కారానికి కాల్‌సెంటర్ ఏర్పాటు

జిల్లాలోని 30 మండలాల పరిధిలో ఉన్న గ్రామ పంచాయతీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కాల్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. ముఖ్యంగా గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు, వీధిలైట్ల నిర్వహణలో పంచాయతీలకు సంబంధించిన ఫిర్యాదులకు జిల్లాస్థాయిలో కాల్ సెంటర్ ఏర్పాటు చేశామని కలెక్టర్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి జిల్లాస్థాయిలో కాల్ సెంటర్ ఏర్పాటు ప్రచార పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటలలోపు మొబైల్ 8019214576కు ఫోన్ చేసి సమస్యలు తెలయజేయవచ్చన్నారు. అదే విధంగా డివిజన్, మండల, గ్రామ స్థాయిలో కూడా ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డీఆర్‌ఓ సత్యనారాయణరావు, డీపీఓ ధనలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పంద్రాగస్టు వేడుకలు ఘనంగా నిర్వహిద్దాం

జిల్లా ప్రజల్లో దేశభక్తి భావాలు రేకెత్తించేలా పంద్రాగస్టు వేడుకలను చేపట్టేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వివిధ శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశించారు. సోమవారం కలక్టరేట్‌లోని సమావేశ హాలులో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. స్థానిక పోలీస్ పేరెడ్ గ్రౌండ్‌లో జరిగే వేడుకల్లో పాఠశాలల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలపై శకటాల ప్రదర్శన అందరినీ ఆకట్టుకునేలా ఉండాలన్నారు.

క్లుప్తంగా

శతాధిక వృద్ధురాలు మృతి


సనగరం లలితమ్మ

పెద్దతిప్పసముద్రం : అన్నమయ్య జిల్లా పెద్దతిప్పసముద్రానికి చెందిన సనగరం లలితమ్మ అనే శతాధిక వృద్ధురాలు సోమవారం అనారోగ్యం కారణంగా గుంటూరులో మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని పీటీఎంకు తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. ఈమె ఎంతో మంది పిల్లలకు ట్యూషన్ ద్వారా విద్యాబుద్ధులు నేర్పారు. ఈమె కుమారుడు సనగరం పట్టాభిరామయ్య స్థానిక శివాలయంలో సేవకునిగా ఉంటూ నిత్య పూజలు నిర్వహిస్తుంటారు.

ఘరానా మోసం

రాజంపేట : రాజంపేట పట్టణంలోని ఉస్మాన్ నగర్‌కు చెందిన ఓ వ్యక్తి తన అకౌంట్ నంబరులో రూ.1500 డిపాజిట్ చేస్తే రూ.1లక్ష ఇస్తామని చెప్పడంతో నమ్మి పలువురు మోసపోయిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. సదరు వ్యక్తి మాటలు నమ్మి అతను చెప్పిన అకౌంట్‌లో చాలామంది డబ్బులు డిపాజిట్ చేశారు. అనంతరం ఆయన ఇచ్చిన మొబైల్ నంబర్‌కు ఫోన్ చేశారు. స్విచ్ ఆఫ్ వస్తోంది. తాము మోసపోయామని డిపాజిట్ చేసిన మహిళలు విలేకర్ల ఎదుట వాపోయారు. అయితే ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు అంటున్నారు.

ఈ-కార్టు ఆఫీసులో రూ. 4 లక్షలు చోరీ

పీలేరు రూరల్ : పీలేరు పట్టణం తిరుపతి రోడ్డు మార్గంలో ఉన్న ఈ-కార్టు పార్సిల్ సర్వీసులో రూ. 4 లక్షలు చోరీ జరిగింది. వివరాలిలా.. స్థానిక తిరుపతి రోడ్డు మార్గంలో ఈ-కార్టు పార్సిల్ సర్వీసు ద్వారా వివిధ కంపెనీల నుంచి పార్సిళ్లు సరఫరా చేస్తున్నారు. ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఈ-కార్టు ఆఫీసు షట్టర్ ధ్వంసం చేసి లోపల ఉన్న లాకర్‌తో పాటు సీసీ కెమెరాలు, మానిటర్లు ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం ఈ-కార్టు మేనేజర్ మణికంఠ ఆఫీసుకు రాగా అప్పటికే ధ్వంసం చేసి ఉండటాన్ని గుర్తించారు. లాకర్‌లో ఉన్న రూ. 4 లక్షలు చోరీ జరిగాయని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ నరసింహుడు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

పదోన్నతులు చేపట్టాలి

రాయచోటి టౌన్ : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న స్కూల్ అసిస్టెంట్ పోస్టులను ఎస్‌జీటీల ద్వారా పదోన్నతి కల్పించాలని, స్కూల్ అసిస్టెంట్లకు హెడ్‌మాస్టర్లుగా పదోన్నతి కల్పించాలని నోబెల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర బాధ్యుడు కొండూరు శ్రీనివాస రాజు డిమాండ్ చేశారు. సోమవారం రాయచోటి డైట్ కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఉపాధ్యక్షుడు ఉడగండ్ల రమేష్, కె. నరసింహారెడ్డి పాల్గొన్నారు.

ఇసుక కోసం భవన నిర్మాణ కార్మికుల ధర్నా

రాజంపేట : రాజంపేటలో ఇసుక కొరత వల్ల పనులు కోల్పోతున్నామంటూ భవన నిర్మాణ కార్మికులు సోమవారం రాజంపేట సబ్ కలెక్టరేట్‌లో ధర్నాకు దిగారు. ధర్నా అనంతరం సబ్ కలెక్టర్ వైఖోమ్ నిదియాదేవికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ డిప్యూటీ సెక్రటరీ ఎంఎస్ రాయుడు, టౌన్ కార్యదర్శి సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌వైజర్‌పై చర్యలు తీసుకోండి

రాయచోటి టౌన్ : పీలేరులోని 100 పడకల ఆస్పత్రిలో పారిశుధ్య కార్మికుల సూపర్‌వైజర్ శ్రీనివాసుల రెడ్డిపై చర్యలు తీసుకోవాలని భారతీయ అంబేడ్కర్ సేన నాయకులు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరికి వినతి పత్రం అందజేశారు. పారిశుధ్య కార్మికులు కానివారి పేర్లు కూడా రిజిస్టర్‌లో నమోదు చేసి డబ్బులు దోచుకుంటున్నారని ఆరోపించారు.

జూదరుల నుంచి రూ.1.10 లక్షలు స్వాధీనం

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని అనంతరాజుపేట పరిధిలోని మామిడి తోటలో పేకాట నిర్వహిస్తున్న వెంకట్రాజుతోపాటు మరో ఆరుగురిని అరెస్టు చేసి రూ. 1.10 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ బాబు తెలిపారు. వీరిని కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

ఉసురు తీసిన ఉత్సాహం

ఈత సరదా ముగ్గురు యువకుల ప్రాణాలను మింగేసింది. తల్లిదండ్రుల ఆశలను చిదిమేసింది. చేతికందివచ్చిన బిడ్డలు తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో కన్నవారి వేదన వర్ణనాతీతంగా మారింది.

- రిజర్వాయర్‌లో ఈతకు వెళ్లి ముగ్గురు యువకుల దుర్మరణం
- మరణంలోనూ వీడని స్నేహం
- ప్రొద్దుటూరులో విషాద ఛాయలు


రహంతుల్లా మృతదేహం వెలికి తీస్తున్న దృశ్యం

మైదుకూరు / దువ్వూరు / ప్రొద్దుటూరు క్రైం : ముగ్గురు స్నేహితులు సరదాగా విహారయాత్రకు వెళ్లి మృత్యువాతపడ్డారు. తెలుగు గంగ జలాశయంలోకి ఉత్సాహంగా ఈత కోసం దిగిన ఆ యువకులను మృత్యుదేవత తన ఒడిలోకి చేర్చుకుంది. మూడు కుటుంబాల్లో విషాదం నింపిన ఈ దుర్ఘటన ఆదివారం జరిగింది. ప్రొద్దుటూరులోని మౌలానా అజాద్ మూడో వీధికి చెందిన పఠాన్ రహంతుల్లా (23), పవర్ హౌస్ రోడ్డుకు చెందిన ఎస్‌కే ముదస్సిర్ (22), సుందరాచార్యుల వీధికి చెందిన వేంపల్లి షాహిద్(23) అనే యువకులు ఆదివారం దువ్వూరు మండలం చల్లబసాయిపల్లె వద్ద ఉన్న మైదుకూరు మండల పరిధిలోని తెలుగు గంగ సబ్సిడరీ రిజర్వాయర్-1(ఏ, బీ బండ్) వద్దకు విహార యాత్రకు వెళ్లారు. అక్కడ ఉన్న పార్కులో కొంత సేపు గడిపిన తర్వాత రిజర్వాయర్ వద్దకు వెళ్లారు. అక్కడ ఫొటోలు కూడా తీసుకున్నారు. రిజర్వాయర్‌లో ఈత కొట్టేందుకు దిగి గల్లంతయ్యారు. రాత్రి అయినా యువకులు ఇంటికి చేరుకోకపోవడంతో వారి కుటుంబ సభ్యులు ఫోన్‌లో విషయం తెలుసుకునేందుకు ప్రయత్నించగా ఫోన్‌లు పనిచేయలేదు. సోమవారం ఉదయం యువకుల స్నేహితులను వాకబు చేశారు. విహార యాత్రకని తెలుగుగంగ రిజర్వాయర్ వద్దకు వెళ్లినట్లు తెలుసుకొని అక్కడికి చేరుకున్నారు. రిజర్వాయర్ కట్టపై యువకుల దుస్తులు, చెప్పులు, సెల్‌ఫోన్‌లు ఉండటం చూసి వారి కోసం చుట్టుపక్కల వెతికారు. కనిపించకపోవడంతో రిజర్వాయర్‌లో గల్లంతై ఉంటారనే అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు మైదుకూరు, దువ్వూరు పోలీసులు రిజర్వాయర్ వద్దకు చేరుకున్నారు. మైదుకూరు అర్బన్, రూరల్ సీఐలు మస్తాన్, శ్రీనాథ్‌రెడ్డి, దువ్వూరు ఎస్ఐ శ్రీనివాసులు యువకుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అగ్నిమాపక సిబ్బందిని, గజ ఈతగాళ్లను పిలిపించారు. వారు రిజర్వాయర్‌లో గాలించి సోమవారం మధ్యాహ్నానికి యువకుల మృతదేహాలను వెలికి తీశారు. రిజర్వాయర్ గేట్ల వద్ద సుమారు 30 అడుగుల లోతు నీరు ఉండటంతో నీటిలోకి దిగిన యువకులకు ఈత రాక మునిగిపోయి మృతి చెంది ఉంటారని భావిస్తున్నారు. గత ఈతగాళ్లు మృతదేహాలను వెలికి తీయగానే వారి కుటుంబ సభ్యులు ఒక్కసారిగా శోకసంద్రంలో మునిగిపోయారు. గుండెలవిసేలా రోదించారు. సరదా కోసం రిజర్వాయర్‌లోకి దిగి మృత్యువాత పడిన ముగ్గురు యువకులు వారి కుటుంబాలకు ఆసరాగా ఉండాల్సిన సమయంలో తీరని దుఃఖాన్ని మిగిల్చారు. సంఘటనపై కేసు నమోదు చేసుకుని మృతదేహాలను పోస్టుమార్టం కోసం ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు అర్బన్ సీఐ మస్తాన్ తెలిపారు.


రహంతుల్లా మృతదేహం వద్ద విలపిస్తున్న తండ్రి నాయబ్‌రసూల్

వాళ్లకు అదే చివరి ఫొటో..

ముదస్సిర్, రహ్మతుల్లా, షాహిద్‌లు కలసి ఎన్నో ఫొటోలు, సెల్ఫీలు తీసుకున్నారు. అయితే ఈత కొట్టేందుకు రిజర్వాయర్‌లో దిగే ముందు ముగ్గురూ చివరి సారిగా సెల్ఫీ తీసుకున్నారు. అయితే వారికి అదే చివరి సెల్ఫీ అయింది. ఈ సెల్ఫీ ఫొటో సోషల్ మీడియాలో బాగా వైరల్ అయింది. వారి స్నేహం పట్ల విధి చిన్న చూపు చూసిందంటూ అందరూ కామెంట్లు పెడుతున్నారు. కాగా యువకుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు.

చెప్పకుండా ఎప్పుడూ వెళ్లలేదు..


పఠాన్ రహ్మతుల్లా (ఫైల్)

ప్రొద్దుటూరులోని మౌలానాఆజాద్ వీధి-3 కి చెందిన పఠాన్ రహ్మతుల్లా స్థానికంగా ఉండే వెంకటేశ్వర ఫార్మసీ కాలేజీలో బీ ఫార్మసీ చదువుతున్నాడు. అతని తండ్రి నాయబ్ ఆర్ట్స్‌కాలేజీలో లెక్చరర్‌గా పని చేస్తున్నాడు. ఆయనకు రహ్మతుల్లాతో పాటు నూరుల్లా అనే మరో కుమారుడు ఉన్నాడు. అతను బీటెక్ చదువుతున్నాడు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో స్నేహితుడిని కలిసేందుకు వెళ్తున్నానని చెప్పి రహంతుల్లా ఇంటి నుంచి వెళ్లాడు. ఇంట్లో చెప్పకుండా అతను ఎక్కడికి వెళ్లేవాడు కాదు. చీకటి పడినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్‌లు చేయసాగారు. అయితే ఫోన్ తగలకపోవడంతో వారిలో ఆందోళన మొదలైంది. తోటి మిత్రులను అడుగగా తెలుగుగంగ రిజర్వాయర్ వద్దకు వెళ్లినట్లు చెప్పారు. దీంతో రాత్రి సమయంలో అక్కడికి వెళ్లినా వారి జాడ కనిపించలేదు. చెప్పకుండా ఎప్పుడూ రహ్మతుల్లా బయటికి వెళ్లలేదని, ఇప్పుడు ఎందుకు వెళ్లాడో అర్థం కావడం లేదంటూ కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు. చివరకు రిజర్వాయర్‌లో పడి మృతి చెందాడనే విషయం తెలియడంతో వారు కన్నీటి పర్యంతమయ్యారు.

సరదాగా గడపాలని..


ముదస్సిర్ (ఫైల్)

ప్రొద్దుటూరులోని పవర్‌హౌస్ రోడ్డుకు చెందిన షేక్ ముదస్సిర్ చిత్తూరులోని ప్రైవేట్ కంపెనీలో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. అతని తండ్రి మున్వర్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయనకు ముదస్సిర్‌తో పాటు ముజమ్మిల్, ముస్తఖీమ్ అనే ముగ్గురు కుమారులు ఉన్నారు. ముదస్సిర్ చిత్తూరు నుంచి శనివారం ఉదయం వచ్చాడు. స్నేహితులను కలుసుకోవాలనే ఉద్దేశంతో మధ్యాహ్నం ఇంటి నుంచి బయటికి వచ్చాడు. చిన్ననాటి స్నేహితులైన రహ్మతుల్లా, షాహిద్‌లను కలుసుకున్నాడు. ముగ్గురూ కలిసి ఈత కొట్టేందుకు తెలుగుగంగ రిజర్వాయర్ వద్దకు వెళ్లారు. సాయంత్రానికి తిరిగి వస్తానని ముదస్సిర్ ఇంట్లో చెప్పి వెళ్లాడు. సాయంత్రం అయినా రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేసినా కలవలేదు. చివరకు కుటుంబ సభ్యులు, స్నేహితులు రిజర్వాయర్ వద్దకు వెళ్లి వెతికినా వారు కనిపించలేదు. తెలుగు గంగ రిజర్వాయర్‌లో గల్లంతైనట్లు సోమవారం ఉదయం వారికి తెలిసింది. దీంతో కుటుంబ సభ్యులు విలపించసాగారు.

స్నేహితులు పిలవడంతో వెళ్లి..


వేంపల్లె షాహిద్ (ఫైల్)

ప్రొద్దుటూరులోని సుందరాచార్యుల వీధి రోడ్డు సమీపంలోని ఆసారేషరీఫ్ వీధిలో నివాసం ఉంటున్న వేంపల్లె షాహిద్ మెడికల్ షాపులో పని చేస్తున్నాడు. అతని తండ్రి అల్తాఫ్ రెండేళ్ల క్రితం కామెర్ల వ్యాధితో మృతి చెందాడు. అతనికి షాహిద్‌తో పాటు షాబాజ్, షానవాజ్ అనే కుమారులు ఉన్నారు. షాహిద్ తల్లి జబీన్ గృహిణి. స్నేహితులు రమ్మని చెప్పడంతో అతను వారితో కలిసి స్కూటీలో ఈతకు వెళ్లాడు. రిజర్వాయర్ పడి మృతి చెందాడని తెలియడంతో తల్లి జబీన్‌తో పాటు కుటుంబ సభ్యులు శోక సంద్రంలో మునిగిపోయారు.

విద్యార్థినులను చితగ్గొట్టిన పంతులమ్మ


ఉపాధ్యాయురాలు కొట్టడంతో చేతివేళ్లపై రక్తం వస్తున్న దృశ్యం

రాజంపేట టౌన్ : రాజంపేట పట్టణంలోని రామ్‌నగర్‌కు చెందిన కవిత అనే ఉపాధ్యాయురాలు తులసి, వెన్నెల అనే విద్యార్థినులను సోమవారం చేతివేళ్లపై స్కేల్‌తో చితక్కొట్టింది. దీంతో ఆ విద్యార్థినులకు రక్త గాయాలయ్యాయి. కాగా తమ పిల్లలు చదవడం లేదని, హోం వర్క్ రాయలేదని ఉపాధ్యాయురాలు కొడుతోందని ఆ పాఠశాలలో చదివే పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. విద్యార్థులను కొట్టకూడదని చట్టం ఉన్నా కొట్టడం ఏమిటని వారు ప్రశ్నించారు.

చదవడం లేదన్న కోపంతోనే కొట్టాను

నాలుగో తరగతికి వచ్చినా కూడా విద్యార్థులకు సరిగ్గా ఎక్కాలు కూడా రాలేదని, ఎంత నేర్పించినా నేర్చుకోక పోవడమే కాక పాఠశాలలో అల్లరి చేస్తుండటం వల్ల కోపం వచ్చి కొట్టినట్లు ఉపాధ్యాయురాలు కవిత తెలిపారు. తమ పాఠశాలకు వచ్చే విద్యార్థులంతా దినసరి కూలీల పిల్లలని, చదువుకోకుంటే వారి తల్లిదండ్రుల్లాగా పిల్లలు కష్టపడతారన్న ఆవేదనతో ఇలా చేశానని ఆమె తెలిపారు.

విచారించి చర్యలు తీసుకుంటాం: ఎంఈఓ

రామ్‌నగర్ ప్రాథమిక పాఠశాలకు చెందిన కవిత అనే ఉపాధ్యాయురాలు విద్యార్థులను కొట్టిన విషయంపై ఎంఈఓ-1 రఘునాథరాజును వివరణ కోరగా, తనకు సోషల్ మీడియా ద్వారా విషయం తెలిసిందన్నారు. ఈ సంఘటనపై మంగళవారం పాఠశాలకు వెళ్లి విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి విచారించి తగు చర్యలు తీసుకుంటామని ఎంఈఓ తెలిపారు.

కోడి తెచ్చిన తంటా

- వృద్ధునిపై దాడి
- చికిత్స పొందుతూ మృతి


మృతి చెందిన వెంకటరెడ్డి

నందలూరు : తన కోడిని ఎవరో దొంగిలించారని వారి అంతు చూస్తానంటూ దుర్భాషలాడిన పాపానికి ఏకంగా ఓ వృద్ధుడు ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటన నందలూరులో జరిగింది. వివరాలిలా.. మండల పరిధిలోని ఎర్రచెరువుపల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం సాతుపల్లి వెంకటరెడ్డి తన పెంపుడు కోడి కనిపించడం లేదని వీధి వెంబడి తిరుగుతూ పలువురిని తిట్టడం మొదలుపెట్టాడు. దీంతో ఆగ్రహించిన పొరుగున ఉండే నాగప్రతాప్‌రెడ్డి కోడి తమ ఇంట్లో ఉందని నమ్మబలికి వెంకటరెడ్డిని ఇంట్లోకి తీసుకెళ్లాడు. ఇంట్లో లైట్లు ఆర్పేసి వెంకటరెడ్డిని విచక్షణారహితంగా కొట్టడంతో అతను ప్రాణాలు వదిలాడు. కొద్దిసేపటి తర్వాత నాగప్రతాప్ రెడ్డి బయటకు వచ్చి వెంకటరెడ్డిని తమ ఇంటి ఆవరణలో చంపేశాను. మీరు వెళ్లి తీసుకెళ్లండి అని ఇరుగుపొరుగు వారికి చెప్పి పరారయ్యాడు. గ్రామస్తులు వెళ్లేసరికి వెంకటరెడ్డి రక్తపు మడుగులో పడి ఉన్నాడు. వెంటనే గ్రామస్తులు, అతని బంధువులకు సమాచారం ఇవ్వడంతో వారు చికిత్స నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఎస్ఐ అబ్దుల్ జహీర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

మదనపల్లె : ద్విచక్రవాహనం ఢీ కొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం మదనపల్లెలో జరిగింది. చెంబకూరుకు చెందిన గంగులప్ప కుమారుడు రామకృష్ణ (62) వ్యక్తిగత పనులపై మదనపల్లెకు వచ్చాడు. చంద్రకాలనీ వద్ద రోడ్డు పక్కన నడిచి వెళుతుండగా ఎదురుగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొంది. ప్రమాదంలో రామకృష్ణ తీవ్రంగా గాయపడగా కాలు విరిగింది.

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ బంగారుపేట వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్ర మాదంలో గూండ్ల కుచేలయ్య తీవ్రంగా గాయపడ్డాడు. బంగారుపేటకు చెందిన కుచేలయ్య జి.వి.ఆర్ సూపర్ మార్కెట్ వద్ద రోడ్డు దాటుతుండగా ఒంటిమిట్ట వైపు నుంచి కడపకు వెళుతున్న ద్విచక్ర వాహనాదారుడు ఢీకొన్నాడు. గాయపడిన అతన్ని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు.

కాల్పుల ఘటనపై కేసు నమోదు

మదనపల్లె : బావమరిదిపై తుపాకీతో కాల్పులకు తెగబడిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ శేఖర్ తెలిపారు. తంబళ్లపల్లెకు చెందిన రెడ్డిప్రవీణ్(23) తన తల్లిదండ్రులతో కలిసి అక్క రెడ్డెమ్మ ఊరైన మదనపల్లె మండలం వలసపల్లె పంచాయతీ నవోదయకాలనీలో గత సంవత్సరన్నర కాలంగా ఉంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి వరుసకు తన బావ పురుషోత్తం తమ్ముడైన దివాకర్, అరవవాండ్లపల్లెకు చెందిన ఆనంద్‌తో మద్యం మత్తులో గొడవపడ్డాడు. దీన్ని గమనించి అక్కడకు వెళ్లిన రెడ్డిప్రవీణ్ గొడవ వద్దంటూ సర్దిచెప్పి దివాకర్‌ను పక్కకు తీసుకువచ్చే ప్రయత్నం చేశాడు. దీంతో ఆగ్రహం చెందిన దివాకర్ ఇంటిలో ఉంచుకున్న నాటుతుపాకీ తీసుకుని రెడ్డిప్రవీణ్‌పై కాల్పులకు తెగబడ్డాడు. ఘటనలో బాధితుడైన రెడ్డిప్రవీణ్‌కు తొడభాగంలో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు గొడవ పడ్డ వారిని అదుపులోకి తీసుకుని కాల్పులు జరిపిన దివాకర్(25)పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. తుపాకీ స్వాధీనం చేసుకున్నామన్నారు.

కడప బ్యాట్స్‌మన్ జోరు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్-19 అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ మ్యాచ్‌లో కడప బ్యాట్స్‌మన్ రాణించడంతో కడప జట్టు ఆధిక్యంలో కొనసాగుతోంది. కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో 132 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన కడప జట్టు 116 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 452 పరుగులు చేసింది. జట్టులోని ఎన్. గురుచరణ్ 147 పరుగులు, రోహిత్ 82 పరుగులతో రాణించారు. శ్రీకాకుళం బౌలర్లు జున్నారావు 3, సుశాంత్ 2, పూర్ణ 2 వికెట్లు తీశారు. కాగా శ్రీకాకుళం జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 204 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. కాగా రెండోరోజు ఆట ముగిసే సమయానికి కడప జట్టు 248 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

అగ్ని ప్రమాదం: 2 లక్షల ఆస్తి నష్టం


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మదనపల్లి సిటీ : మదనపల్లె పట్టణం, గొల్లపల్లి రింగ్ రోడ్డు లోని ఓ గుజిరి మండిలో సోమవారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో సుమారు రెండు లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగింది. అగ్నిమాపక అధికారి శివప్ప, టూ టౌన్ సీఐ యువరాజ్ తెలిపిన వివరాలు.. స్థానిక గొల్లపల్లిలో కాపురం ఉంటున్న సయ్యద్ హుస్సేన్ గుజరీ వ్యాపారం చేస్తున్నాడు. రాత్రి 10 గంటల ప్రాంతంలో కరెంట్ షాక్ సర్క్యూట్ కారణంగా మంటలు ఎగిసిపడి సామగ్రి కాలిపోయింది. సమాచారం అందుకున్న రెండో పట్టణ సీఐ యువరాజు సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. వారు వచ్చి మంటలను అదుపు చేశారు. దీంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

వ్యవసాయ రంగంపై నిర్లక్ష్యం వీడాలి


ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సమావేశానికి హాజరైన నాయకులు

మదనపల్లె : వ్యవసాయ రంగంపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వీడి, కేంద్ర బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలని వ్యవసాయశాఖ మాజీ మంత్రి, రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం అన్నమయ్య జిల్లా మదనపల్లెలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం అధ్యక్షుడు ఈశ్వరయ్య అధ్యక్షతన రైతు సమ్మేళనం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి నిధుల కేటాయింపులు తగ్గిపోయాయన్నారు. కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులు వ్యవసాయ రంగాన్ని సంక్షోభం నుంచి, రైతుల ఆత్మహత్యల నుంచి కాపాడలేవని, కార్పొరేట్లకు ఊడిగంచేసే బడ్జెట్‌గా అభివర్ణించారు. ప్రతి సంవత్సరం కార్పొరేట్లకు పన్ను రాయితీలు, రుణమాఫీలు చేస్తున్నారని, దేశానికి తిండి పెట్టే రైతాంగానికి మాత్రం బడ్జెట్ కోతలు పెడుతూ వ్యవసాయ రంగాన్ని గాలికి వదిలేశారన్నారు. స్వామినాథన్ సిఫారసుల మేరకు సీ2+ 50 శాతం కలిపి మద్దతు ధరలు ప్రకటించి చట్టబద్ధత కల్పించాలని రైతాంగం ఉద్యమాలు చేస్తుంటే పెడచెవిన పెడుతున్నారన్నారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సమావేశాల్లో రైతు రుణ మాఫీ చేసి రుణ ఉపశమన చట్టం తెచ్చి ఆత్మహత్యల నుంచి రైతాంగాన్ని కాపాడాలని కోరారు. అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య మాట్లాడుతూ లక్షల కోట్ల రూపాయలు 12 మంది కార్పొరేట్లకు కట్టపెట్టేందుకు ప్రధాని నరేంద్ర మోడీ ప్రయత్నిస్తున్నారని విరుచుకుపడ్డారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవీవీ ప్రసాద్, రైతు సంఘం రాష్ట్ర నాయకులు కాటమయ్య, జమాలయ్య, కెవీ జగన్నాథం, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్ నరసింహులు, మదనపల్లి నియోజకవర్గ కార్యదర్శి మురళి తదితరులు పాల్గొన్నారు.

పేరు మార్చి అయినా పథకాలు అమలు చేయాలి

ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



రాజంపేట రూరల్ : వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన పథకాలకు పేరు మార్చి అయినా అమలు చేసి ప్రజలకు అండగా నిలవాలని సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి సూచించారు. మండల పరిధిలోని ఆకేపాటి ఎస్టేట్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అమ్మ ఒడి పథకం కింద పిల్లలకు నగదు అందకపోవడంతో తల్లిదండ్రులు ఇక్కట్లకు గురవుతున్నారన్నారు. అలాగే ఖరీఫ్ సీజన్ మొదలైనా రైతు భరోసా నగదు జమ కాలేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక పోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రుల మనోవేదన అర్థమవుతోందా చంద్రబాబు అని నిలదీశారు. డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు అండగా ఉండే సున్నావడ్డీ పథకం అతీగతీలేదని మండిపడ్డారు. సీఎంగా జగనన్న ఉండి ఉంటే ఈ అన్ని పథకాలు సరైన సమయంలో అమలై రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉండే వారు కాదా అని ప్రశ్నించారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సూపర్ మార్కెట్ దగ్ధం

రూ.40 లక్షలు ఆస్థినష్టం

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న వైఎస్సార్ సూపర్ మార్కెట్ సోమవారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. స్థానికుల కథనం మేరకు తెల్లవారుజామున రెండు గంటల ప్రాంతంలో సూపర్ మార్కెట్ నుంచి పొగలు వస్తూ పెద్దఎత్తున పేలుళ్లు సంభవించడంతో స్థానికులు భయాందోళనతో ఇళ్లలో నుంచి బయటకు వచ్చారు. సూపర్ మార్కెట్ నుంచి పెద్దఎత్తున మంటలు, పొగ, శబ్దాలు రావడాన్ని గమనించి యజమాని మల్లు సుదర్శన్ రెడ్డికి ఫోన్ చేసి తెలిపారు. వెంటనే యజమాని అక్కడికి చేరుకుని స్థానికుల సహకారంతో సూపర్ మార్కెట్ తలుపులు తెరిచి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. అప్పటికే దాదాపు పూర్తిస్థాయిలో మంటలు వ్యాపించాయి. దీంతో సూపర్ మార్కెట్‌లోని ఫ్రిజ్, టీవీలు, వస్తువులు, క్యాష్ కౌంటర్‌లో ఉన్న రూ. 3 లక్షలు నగదు, పద్దుల చిట్టా, పాసు పుస్తకాలు, బాండ్లు, బంగారం వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. దాదాపు రూ. 40 లక్షలు నష్టం వాటిల్లిందని యజమాని మల్లు సుదర్శన్ రెడ్డి తెలిపారు.